నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, బుధవారం 24 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

## తిరుమలగిరి మార్కెట్‌కు 1,283 బస్తాల వేరుశనగ

**మద్దతుకు మించి రూ. 6,739 ధర**

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ కాయ

తిరుమలగిరి జనవరి 23 : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 1,283 బస్తాల వేరుశనగ కాయ వచ్చింది. మద్దతు ధర క్వింటాకు రూ.6,739 కాగా గరిష్ఠంగా రూ.7,259 కనిష్ఠంగా రూ.5,909 పలికింది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు అత్యధికంగా 1,283 బస్తాలు రావటం ఇదే మొదటి సారి. జనవరి నెలలో ఇప్పటి వరకు మొత్తం 228 మంది రైతులు 4,980 (1512 క్వింటాళ్లు)బస్తాలు వేరుశనగ తెచ్చారు. ఈ సీజన్ ప్రారంభంలో మద్దతు ధర రూ.5 వేలు ఉండగా క్రమంగా ధర పెరుగుతూ వచ్చింది. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలుకుతున్నది. తిరుమలగిరి మార్కెట్‌కు మంచి రవాణా సౌకర్యంతోపాటు మూడు జిల్లాలు జనగాం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాకు అందుబాటులో ఉండటం వల్ల ఇక్కడికి ఎక్కువ రైతులు తమ పంటలు విక్రయించడానికి వస్తుంటారు.

# 12,06,671

## ఇదీ జిల్లాలో వివిధ పథకాల కోసం లబ్ధిదారుల దరఖాస్తులు

- ఒక్కో అప్లికేషన్‌లో ఇద్దరు నుంచి నలుగురు
- ఒక్కో వ్యక్తి రెండు, మూడు పథకాలకు అర్హులు
- అత్యధికంగా రూ. 2,500 స్కీమ్ కోసం వినతులు
- ఆ తర్వాతి వరుసలో సబ్సిడీ గ్యాస్, ఫ్రీ కరెంట్, ఇండ్లు
- ఉద్యమ కారుల స్థలం కోసం 2,616 మంది దరఖాస్తులు
- ఇటీవల 2,68,790 దరఖాస్తుల కంప్యూటరైజ్డ్ పూర్తి
- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల పరిశీలన ఎప్పుడో..?

*ఆరు గ్యారెంటీల పథకాల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ కార్యక్రమం పూర్తయ్యింది. జిల్లాలో వివిధ పథకాల కోసం 12,06,671 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా రూ. 2,500 పథకం కోసం వినతులు పెట్టుకున్నారు. ఆ తర్వాత సబ్సిడీ గ్యాస్, ఫ్రీ కరెంట్, ఇండ్ల కోసం అప్లికేషన్‌లో టిక్ చేశారు. ఇక తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల స్థలం కోసం 2,616మంది అప్లికేషన్ చేశారు. దరఖాస్తుల కంప్యూటరైజేషన్ జరిగి వారం గడుస్తున్నా తదుపరి కార్యాచరణపై ఇంకా స్పష్టత రాలేదు.*

*– యాదాద్రి భువనగిరి, జనవరి 23 (నమస్తే తెలంగాణ)*

### ప్రజాపాలన దరఖాస్తులు ఇలా..

| అంశం | యాదాద్రి | నల్లగొండ | సూర్యాపేట |
|---|---|---|---|
| ఆన్‌లైన్ అయిన దరఖాస్తులు | 2,89,682 | 5,35,152 | 3,75,093 |
| రూ. 2,500 పథకం | 2,32,053 | 4,58,711 | 3,18,053 |
| సబ్సిడీ గ్యాస్ | 2,30,412 | 4,60,336 | 3,26,383 |
| రైతు బంధు | 1,22,084 | 2,60,149 | 1,60,334 |
| కౌలు బంధు | 7,316 | 16,498 | 12,056 |
| వ్యవసాయ కూలీలు | 1,29,723 | 2,87,062 | 2,31,263 |
| ఇండ్లు | 2,06,530 | 4,41,603 | 3,16,884 |
| 250 గజాలు (అమరులు) | 388 | 748 | 589 |
| 250 గజాలు (ఉద్యమ కారులు) | 2,616 | 3,792 | 3,161 |
| ఫ్రీ కరెంట్ | 2,09,899 | 3,79,242 | 2,75,272 |
| దివ్యాంగుల పింఛన్లు | 8,351 | 15,292 | 10,623 |
| ఇతర పింఛన్లు | 57,299 | 95,604 | 74,465 |
| మొత్తం | 12,06,671 | 24,19,037 | 17,29,083 |

నల్లగొండలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఈ మేరకు అధికారంలోకి వచ్చాక ఆయా పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరింది. ఇందుకోసం గత నెల 28వ తేదీన ప్రజా పాలన కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 6న దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియగా, వాటిని 17వ తేదీ వరకు ఆన్‌లైన్ చేశారు. మొత్తంగా 2,68,790 దరఖాస్తులను కంప్యూటరైజ్డ్ చేశారు. ఒక్కో దరఖాస్తులో కుటుంబలోని నలుగురైదుగురు వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులోనూ ఒకే వ్యక్తి రెండు, మూడు పథకాల కోసం టిక్ చేశారు. దీంతో వివిధ పథకాల కోసం మొత్తంగా 12,06,671 లబ్ధిదారులుగా దరఖాస్తుల్లో పేర్కొన్నారు.

### రూ. 2,500 పథకం కోసం మస్తుగా..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని వాగ్దానం చేసింది. దీంతో ప్రజాపాలన దరఖాస్తుల్లో అత్యధికంగా 2,32,053 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత సబ్సిడీ గ్యాస్ కోసం 2,30,412, ఫ్రీ కరెంట్ కోసం 2,09,899, ఇండ్ల కోసం 2,06,530, రైతు బంధు కోసం 1,22,084, కౌలు బంధు కోసం 7,316, దివ్యాంగ పింఛన్లకు 8,351, ఇతర పింఛన్లకు 57,299, ఉద్యమ కారులకు 250 గజాల కోసం 2,616 దరఖాస్తులు వచ్చాయి.

### క్షేత్రస్థాయి పరిశీలన ఎప్పుడో..?

ఇటీవల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని ఇప్పటికే అధికారులు పేర్కొన్నారు. కుటుంబంలో ఎంత మంది ఉన్నారు..? ఏయే పథకానికి దరఖాస్తు చేసుకున్నారు..? అర్హులా కాదా..? ఆస్తులెన్ని..? తదితర అంశాలను పరిశీలిస్తారని తెలిపారు. కానీ ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసి వారం గడుస్తున్నా దీనికి సంబంధించి ఎలాంటి కార్యక్రమం ప్రారంభించలేదు. ఎప్పుడు చేస్తారనే స్పష్టత కూడా లేదు. దీంతో దరఖాస్తులు ఎప్పుడు పరిశీలిస్తారో..? పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నల్లగొండ, సూర్యాపేటలో ఇలా..

నల్లగొండ జిల్లాలో 5,35,152 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఇందులో అత్యధికంగా సబ్సిడీ గ్యాస్ కోసం 4,60,336 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత 2,500 పథకం కోసం 4,58,711, ఇండ్లు 4,41,603, ఫ్రీ కరెంట్ కోసం 3,79,242, రైతు బంధు కోసం 2,60,149 అప్లికేషన్లు వచ్చాయి. సూర్యాపేట జిల్లాలో 3,75,093 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఇందులో అత్యధికంగా సబ్సిడీ గ్యాస్ కోసం 3,26,383 అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఆ తర్వాత 2,500 పథకం కోసం 3,18,053, ఇండ్ల కోసం 3,16,884, ఫ్రీ కరెంట్ కోసం 2,75,272 దరఖాస్తులు వచ్చాయి.

స్వామివారి నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

## నారసింహుడికి వైభవంగా నిత్యార్చనలు

యాదగిరిగుట్ట, జనవరి 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో నారసింహుడి నిత్యోత్సవాలు వైభవంగా సాగాయి. సుప్రభాతం నుంచి పవళింపు సేవ వరకు స్వామి, అమ్మవార్ల నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమ శాస్త్రం ప్రకారం జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. సుదర్శన నారసింహ హోమం పాంచరాత్రగమ శాస్త్రం రీతిలో సాగింది. ఉదయం ఆలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ సుదర్శన నారసింహ హవనం జరిపారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహన సేవ చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ మూర్తులకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్ల తిరువీధిసేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని సుమారు 10వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.18,88,785 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

## వైటీడీఏను ప్రక్షాళన చేస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, జనవరి 23 : యాదగిరిగుట్ట దేవస్థానం, వైటీడీఏను ప్రక్షాళన చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 27న వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈఓ, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులు, కొత్తగా చేపట్టాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట ఆలయ అధికారుల తీరు సరిగాలేదని, ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని అన్నారు. వైటీడీఏతో ఈ ప్రాంతానికి నష్టమేనని, స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో యాదగిరిగుట్ట అభివృద్ధి చేపడుతామని అన్నారు. అవసరమైతే వైటీడీఏ బదులు దేవస్థాన పాలక మండలిని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మంత్రులు, ప్రాంతీయ అఖిలపక్ష నాయకులతో చర్చించి యాదగిరిగుట్ట అభివృద్ధిపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. యాదగిరిగుట్ట, ఆత్మకూరు(ఎం), ఆలేరు, బొమ్మలరామారం మండలాల్లో రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. యాదగిరిగుట్ట కొండపైకి ఆటోల అనుమతికి చర్యలు చేపడుతామన్నారు. కొండపై డార్మిటర్ హాల్ నిర్మించి భక్తులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని చెప్పారు. యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపాలిటీల్లో నిధుల కొరత చాలా ఉన్నదని, సిబ్బందికి ప్రతి నెలా రెండో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కౌన్సిలర్లు ముక్కర్ల మల్లేశ్, కమిషనర్లు అజయ్‌కుమార్‌రెడ్డి, చక్రపాణి, ఏఈలు శ్రీరాం, నవీన్ పాల్గొన్నారు.

## పీఈఎల్ కార్మికులు మెచ్చేలా వేతన ఒప్పందం

- బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 23 : ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ కార్మికులు మెచ్చే విధంగా వేతన ఒప్పందాన్ని తీసుకొచ్చామని బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ బీఆర్ఎస్‌కేవీ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో గుర్తింపు సంఘాలు చేయలేని ఒప్పందాన్ని తాము చేసి చూపామన్నారు. ప్రతి కార్మికుడి శ్రేయస్సు కోరే విధంగా తమ కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్‌కేవీ పని చేస్తున్నదని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్‌కేవీ పీఈఎల్ విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బరిగె నర్సింహులు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వంచ రామచంద్రారెడ్డి, కోశాధికారిగా గవ్వల శ్రీనివాస్, గౌరవ ఉపాధ్యక్షులుగా ఎలక్షన్‌రెడ్డి, పి.ఆదామ్, రమేశ్, చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా ఎల్లగౌడ్, పాపయ్య, లక్ష్మీనర్సయ్య, వెంకటరమణ, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, బాలరాజు, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, స్టాఫ్ రిప్రజెంటేటివ్‌గా శ్రీశైలం ఎన్నికయ్యారు.

## అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

స్థాయీ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 23 : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలకు అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఒకటవ(ఆర్థిక ప్రణాళిక), ఏడవ(పనులు), నాల్గవ(విద్య, వైద్య) స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా అధికారులు పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పరిధిలో నిర్వహించిన అభివృద్ధి పనులపై సమీక్ష చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో స్థాయీ సంఘాల సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, డాక్టర్ కుడుదుల నగేశ్, ఎండీ ఖలీల్, జిల్లా పరిషత్ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

## హాలియా డిగ్రీ కాలేజీలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

హాలియా, జనవరి 23 : హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్–1, కామర్స్ –1 సబ్జెక్ట్‌లను బోధించుటకు అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పగడి రంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వబడునని, సంబంధిత సబ్జెక్టులలో పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు ఈ నెల 27న సాయంత్రం 4 గంటల్లోపు తమ దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 9440208972 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## గంజాయిని తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

- రూ.26.70 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

పంతంగి వద్ద గంజాయిని పట్టుకున్న పోలీసులు

చౌటుప్పల్, జనవరి 23 : గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని మహేశ్వరం ఎస్ఓటీ బృందం, చౌటుప్పల్ పోలీసులు కలిసి సోమవారం రాత్రి పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. వారి వద్ద రూ.27.70లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ సీఐ ఎస్.దేవేందర్ మంగళవారం వాటి వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ జిల్లా సాహిబాబాద్ గ్రామానికి చెందిన మహ్మద్ రాయిస్ హాఫ్రిద్ రిక్షా పుల్లర్‌గా(ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యాపారం) పనిచేసే వాడు. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లా కుడారి గ్రామానికి చెందిన డ్రైవర్ మిథ్లేస్ సింగ్‌తో కలిసి వ్యాపారం చేసేవాడు. వీరికి న్యూ ఢిల్లీకి చెందిన ఓ డ్రగ్స్ వ్యాపారితో పరిచయం ఏర్పడింది. అతడు గంజాయిని రవాణా చేస్తే భారీగా నగదు అందజేస్తానని హామీ ఇచ్చాడు. అతడి సూచనల మేరకు ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ మీదుగా న్యూఢిల్లీకి తరలిచేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు పక్కా సమాచారంతో మార్గమధ్యంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద వీరిని పట్టుకున్నారు. వారి వద్ద రూ.27.70 లక్షల విలువైన 90 కిలోల గంజాయిని, కారును, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా వీరు ఈ డ్రగ్స్ అక్రమ రవాణా చేసినట్లు ఒప్పుకొన్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

## రేపు ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా

నల్లగొండ రూరల్, జనవరి 23 : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు కంపెనీల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్స్, టెలీకాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ పలు పోస్టులకు నల్లగొండ పట్టణంలోని ఉపాధి కల్పన కార్యాలయ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా మెకానికల్, బీఎం, ఫార్మసీలు చదివిన 18–35 ఏళ్ల వయస్సు గల స్త్రీ,పురుషులు అర్హులని పేర్కొన్నారు. అసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 న ఉదయం 10 గంటల వరకు ఉపాధి కల్పన కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9951720856 ను సంప్రదించాలన్నారు.

## భువనగిరి మున్సిపల్‌లో కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్

### చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- 35 మంది కౌన్సిలర్లలో 31 మంది హాజరు
- అందరూ చేతులెత్తి అవిశ్వాసానికి మద్దతు

మున్సిపల్ కౌన్సిల్ హాల్లో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఆర్డీఓ అమరేందర్, పాల్గొన్న కౌన్సిలర్లు

భువనగిరి అర్బన్, జనవరి 23 : భువనగిరి మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. బీఆర్ఎస్‌ను బలహీన పరిచేందుకు కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ అయ్యాయి. లోపాయికారి ఒప్పందంతో రెండు కలిసికట్టుగా ఉండి చైర్మన్, వైస్ చైర్మన్‌ను పడగొట్టాయి. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ అమరేందర్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనికి 31 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి చేతులు ఎత్తి ఓటు వేశారు. దాంతో మున్సిపల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులను కోల్పోగా కౌన్సిలర్లుగా కొనసాగనున్నారు. ఈ అవిశ్వాసానికి చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు 5వ వార్డు కౌన్సిలర్ ఏవీ కిరణ్‌కుమార్, 17వ వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి హాజరు కాలేదు.

### 35 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో మెంబర్

భువనగిరి మున్సిపాలిటీలో 35 మంది కౌన్సిలర్లు, ఒకరు ఎక్స్ అఫీషియో మెంబర్ (ఎమ్మెల్యే) ఉన్నారు. రాయగిరి చెందిన మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్‌గా చింతల కిష్టయ్యను ఎన్నుకోగా నాలుగు సంవత్సరాల నుంచి పదవుల్లో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో 2023 డిసెంబర్ 30న బీఆర్ఎస్ కౌన్సిలర్లు 16 మంది, కాంగ్రెస్ కౌన్సిలర్లు 9 మంది, బీజేపీ కౌన్సిలర్లు ఆరుగురు కలిసి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దాంతో కలెక్టర్‌కు జనవరి 23న అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టాలని ఆర్డీఓ అమరేందర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీని కోసం హాజరైన 31 మంది సభ్యులు మొత్తం అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయడంతో నెగ్గింది.

### క్యాంపులకు కౌన్సిలర్లు

భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ఏర్పాటు చేయాలని కోరుతూ డిసెంబర్ 30న కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. మంగళవారం పెట్టిన అవిశ్వాసానికి వారు నేరుగా క్యాంపు నుంచి హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గిన అనంతరం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి 30వ వార్డు కౌన్సిలర్ ఎండీ అజిమోద్దీన్ సమక్షంలో కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అవకాశం వస్తే చేజిక్కించుకోవాలని వారి వ్యూహంతో ముందుకెళ్తున్నారు. 35 మంది కౌన్సిలర్లలో 20 మంది బీఆర్ఎస్, 9 మంది కాంగ్రెస్, ఆరుగురు బీజేపీ సభ్యులు ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవడానికి బీఆర్ఎస్ పార్టీకే అవకాశం ఉండడంతో చైర్మన్ పదవి దక్కించుకోవడానికి 30వ వార్డు కౌన్సిలర్ ఎండీ అజిమొద్దీన్ పావులు కదుపుతున్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక తేదీ వచ్చే వరకు క్యాంపులు కొనసాగనున్నట్లు తెలుస్తున్నది.